నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | HYDERABAD



### దివి సందడి..

కూకట్‌పల్లిలోని ఓ మాల్‌లో శనివారం ఫ్లవర్ ఫెస్టివల్ రెండో సీజన్‌ను నటి దివి ప్రారంభించింది. అనంతరం ఇలా వాహనంపై కూర్చొని సందడి చేసింది.

## సమయానికంటే ముందే వెళ్లారు..

### 14 మంది ఉద్యోగులపై కలెక్టర్ చర్యలు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): అనుమతి లేకుండా కార్యాలయం నుంచి సమయం కంటే ముందుగానే వెళ్లిపోయిన ఉద్యోగులపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చర్యలు తీసుకున్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న 14 మంది సిబ్బంది శుక్రవారం విధులకు వచ్చి అటెండెన్స్‌లో సంతకం చేసిన వెంటనే వెళ్లిపోయినట్లు తెలిపారు. వారి ఒక రోజు వేతనం నిలుపుదలతో పాటు సర్వీస్‌ను కౌంట్ చేయొద్దని ఆదేశిస్తూ ఎఫ్ఆర్ 18 ప్రకారం, శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

# సూరం చెరువులో కూల్చివేతలు

## చెరువు ఆక్రమించి వెంచర్ విస్తరణ.. స్థానికుల ఫిర్యాదుతో నోటీసులిచ్చిన హైడ్రా

### సమాచారం తెలుసుకుని తమ బోర్డులు తొలగించిన వర్టెక్స్ కెఎల్ఆర్ గిగా



సూరం చెరువులో ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది





సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని సూరం చెరువులో శనివారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. అక్రమంగా అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. మాంఖల్ పరిధిలోని 139,140 సర్వే నెంబర్లలో అక్రమంగా నిర్మించారంటూ ప్రహరిని, రేకులషెడ్డును హైడ్రా అధికారులు మున్సిపల్ సిబ్బందితో కలిసి జెసిబితో తొలగించారు. సూరన్ చెరువు మొత్తం విస్తీర్ణం 60 ఎకరాలు కాగా దాదాపు 15 ఎకరాలు స్థానికంగా లేఔట్లు చేస్తున్నవారు కబ్జా చేశారని హైడ్రా తెలిపింది. చెరువులోకి జరిగి చుట్టూ ప్రహరీ నిర్మించారని, డ్రైనేజి పైప్‌లైన్లు కూడా వేశారని రంగనాథ్ తెలిపారు. ఎఫ్‌టిఎల్ పరిధిలో ప్రీకాస్ట్‌తో నిర్మించిన కాంపౌండ్‌వాల్, చుట్టూ ఉన్న పరిస్థితులను స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రంగనాథ్ క్షేత్రస్తాయిలో పరిశీలించారు. దీంతో పాటు కొత్త కుంటకు వెళ్లే ఫీడర్‌చానల్‌ను మూసేయడంతో అక్కడ ఉన్న అడ్డంకిని తొలగించారు.ఇదిలా ఉంటే హైడ్రా ప్రజావాణికి చెరువు ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా బృందం మూడురోజుల కిందట నోటీసులు ఇచ్చారు. దీనిపై వారిదగ్గరున్న డాక్యుమెంట్స్ తీసుకురావాలని, ఆక్రమణలపై క్లారిటీ ఇవ్వాలని కోరారు. కానీ ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వకపోగా.. వెంచర్ దగ్గర వర్టెక్స్ కెఎల్‌ఆర్ గిగా పేరుతో బోర్డ్ పెట్టి వెంచర్ చేసి ప్లాట్లు అమ్ముతున్నారు. హైడ్రా నోటీసులు ఇవ్వగానే ఆ బోర్డు తొలగించి ప్లాట్ల ఓనర్ల పేరుతో వాల్‌రైటింగ్స్ రాయించారు.

### గొలుసుకట్టు చెరువులు ఆక్రమించి వెంచర్..!

వాస్తవానికి ఈ లేఅవుట్ శ్రీశైలం రాష్ట్రరహదారిని అనుసరించి ఉంటుంది. ప్రచారం కోసం మొన్నటివరకు రహదారికి కనిపించేలా లేఅవుట్ ముందు వర్టెక్స్ కెఎల్‌ఆర్ గిగా అనే యూనిపోల్ ఉండేది. ఈ నేపథ్యంలో ఈ వెంచర్ వాళ్లే సూరం చెరువుతో పాటు దాని ఎగువన కొత్త కుంట వరకు ఉన్న ఫీడర్ చానల్‌ను కూడా కలుపుకుని ప్లాట్లు చేశారు. హైడ్రా ప్రజావాణిలో తుర్కగూడకు చెందిన స్థానికులు కమిషనర్‌కు చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. దీంతో రంగనాథ్ క్షేత్రస్థాయి పర్యటన చేసి చెరువులో ఆక్రమణలు నిజమే అని తేల్చారు. గతంలో ఈ వెంచర్ ఉన్న స్థలం మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కెఎల్‌ఆర్‌ది కావడం గమనార్హం. హైడ్రా ఏర్పాటు తర్వాత పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో కెఎల్‌ఆర్ వివరణ ఇచ్చారు. తాను తొలుత చేసిన లేఅవుట్‌లో చెరువుకు సంబంధించిన భూమి లేదని, తాను వర్టెక్స్ వారికి విక్రయించిన తర్వాత విస్తరణలో భాగంగా సదరు వర్టెక్స్ కంపెనీ వాళ్లు చెరువు భూమిని ఆక్రమించి వెంచర్ చేపట్టారని అప్పట్లోనే మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కెఎల్‌ఆర్ ప్రకటించారు. ఇప్పుడు హైడ్రా యాక్షన్‌కు దిగగానే సదరు ప్లాట్ల ఓనర్లు తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు హైడ్రా అధికారులు చెరువులలోకి చొచ్చుకొచ్చిన ఆక్రమణలను తొలగిస్తామని చెబుతున్నారు.




అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

# కాంగ్రెస్ పాలన గాడి తప్పింది

## అభివృద్ధికి ఒక్క పైసా ఇవ్వడం లేదు

### 'పాలమూరు-రంగారెడ్డి'పై కేంద్రాన్ని నిలదీయలేని అసమర్థత రేవంత్‌ది

### కేసీఆర్ ఒక విజన్‌తో పనిచేశారు

### కాంగ్రెస్ ప్రభుత్వానికి అది సాధ్యం కావడం లేదు

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి ఒక్క పైసా కేటాయించడం లేదని పాలన పూర్తిగా గాడి తప్పిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లో కొత్తగా ఏర్పాటు చేసిన బస్తీ దవఖానను, మహిళా భవనాన్ని ఆమె శనివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవారికి నాణ్యమైన వైద్యం అందించడానికి కేసీఆర్ చక్కటి విజన్‌తో అనేక ఆరోగ్య పథకాలు అమలు చేశారని అనేక వైద్య మౌలిక వసతులు ఏర్పాటు చేశారని తెలిపారు. అందులో భాగంగానే మహేశ్వరం నియోజకవర్గంలో 10 బస్తీ దవఖానలు, 8 అర్బన్ దవఖానలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు. అంతేకాకుండా నగరంలో 4 సూపర్ స్పెషాలిటీ దవాఖానలను ఏర్పాటు చేయడానికి మాజీ సీఎం కేసీఆర్ 1200 కోట్ల రూపాయల చొప్పున కేటాయించినట్టు ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. సమూలమైన మార్పులు చేయడానికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని ఆమె గుర్తు చేశారు. బడంగ్‌పేటలో త్వరలోనే 50 పడకల ఆసుపత్రి నిర్మాణం చేయించడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

### శంకుస్థాపనలు సరే.. మరి నిధులేవీ?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహేశ్వరం నియోజకవర్గానికి మంత్రులందరూ వచ్చి పోతున్నారు తప్ప ఒక్క పైసా ఇవ్వలేదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. శంకుస్థాపనలు చేసి పోతున్నారే తప్ప నిధులు మాత్రం ఇవ్వడం లేదని తెలిపారు. అభివృద్ధికి సహకరించకుండా ఆరోపణలకే పరిమితమవుపోతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పాలన అంతా గాడి తప్పిపోయిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో సిబ్బందికి కనీసం వేతనాలు ఇవ్వలేకపోతున్నారని ఆమె ఆరోపించారు. గతంలో సర్పంచులు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని అన్నారు.

### మేం నిధులిస్తే..కాంగ్రెస్ రద్దు చేసింది

చెరువులను అభివృద్ధి చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ఆమె ధ్వజమెత్తారు. అల్మాస్‌గూడలో ఉన్న చెరువుల అభివృద్ధికి 2 కోట్లు బీఆర్ ఎస్ ప్రభుత్వం కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని రద్దు చేయించిందని ఆమె మండిపడ్డారు. చెరువును అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉన్న ప్రజలకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో చెరువులను సుందరీ కరణ చేశామని తెలిపారు. కొంతమేరకు పనులైన తర్వాత మధ్యంతరంగా పనులు నిలిపివేయడం ఎంతవరకు సమంజసం అని సబిత ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వమని కేంద్ర ప్రభుత్వం చెప్పితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని ఆమె విమర్శించారు. నియోజకవర్గానికి సంబంధించిన ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకపోతే కేంద్రాన్ని ఎందుకు అడగడం లేదో సీఎం సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డి ఎం హెచ్‌ఓ డాక్టర్ గీత, డాక్టర్ బాలమణి, డి ఈ జ్యోతి, మాజీ ప్రజా ప్రతినిధులు ముత్యాల లలిత కృష్ణ, ఏనుగు రాంరెడ్డి, యాతం పవన్, అర్జున్, సంరెడ్డి వెంకట్ రెడ్డి, రామిడి రామ్ రెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, జంగారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆ కోడ్ నంబర్లుంటే అస్సలు ఫోన్ ఎత్తొద్దు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ):

**గతంలో వేరే దేశం కోడ్ నెంబర్లతో కాల్స్ వస్తే ఎత్తకున్నా ఫర్వాలేదు అనుకునే వారు..**

**కానీ ఇప్పుడేమో మిస్డ్ కాల్స్ వచ్చి పోతే ఇదేంటోఅని తిరిగి డయల్ చేసే ప్రయత్నం చేస్తున్నారు.**

**ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు ఇతర దేశాల కోడ్ నెంబర్లతో ఫోన్లు చేస్తారు.. లేదా మిస్డ్ కాల్స్ ఇస్తారు..**

**అవి చూసి ఫోన్ ఎత్తినా, కాల్‌బ్యాక్ చేసినా వారి పని అంతేసంగతులు..**

**మీరు సైబర్ నేరగాళ్ల ట్రాప్‌లో పడ్డట్లే.. ఊహించని సమస్యల్లో చిక్కుకున్నట్లే.. తస్మాత్ జాగ్రత్త అంటున్నారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు.**

సైబర్ నేరగాళ్లు ఇప్పుడు మరో కొత్త మోసానికి తెరదీశారు. మిస్డ్ కాల్స్, వర్చువల్ కాల్స్‌తో ప్రజలను ట్రాప్ చేస్తున్నారు. ముందు తాము కాల్ చేయాలనుకున్న వ్యక్తికి వేరే దేశాల కోడ్స్‌తో మిస్డ్ కాల్ ఇచ్చి వదిలేస్తారు. కాల్ వచ్చింది కదా అని తిరిగి కాల్ బ్యాక్ చేశామంటే బ్యాంక్ అకౌంట్‌తో లింకైన ఫోన్‌నెంబర్ ద్వారా డేటా అంతా సైబర్ నేరగాళ్ల చేతిలో పడ్డట్లే.

ఇండియాకు చెందిన 91 కోడ్‌తో మినహా ఏ ఇతర ఇంటర్నేషనల్ కోడ్‌తో కాల్స్ వచ్చి కట్ అయిందంటే తిరిగి కాల్ చేయవద్దని చెబుతున్నారు సైబర్ క్రైమ్ పోలీసులు. ఇది సైబర్ నేరగాళ్లు చేసే కాల్..! ఈ కాల్ ద్వారా బ్యాంక్ అకౌంట్స్ హ్యాక్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు.

> ఫేక్ కాల్స్‌తో తస్మాత్ జాగ్రత్త..
>
> అమ్మాయిల డీపీ చూసి మోసపోకండి
>
> విదేశీ కోడ్‌లతో వచ్చే కాల్స్ లిఫ్ట్ చేస్తే ట్రాప్ అయినట్లే..

### 91 మినహా ఇతర కోడ్స్ అన్నీ డేంజరే..!

సైబర్ నేరగాళ్లు రోజుకొక తీరుగా మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఫారెన్ కోడ్స్‌తో ఫోన్లు చేసి అవతలవారి పర్సనల్ డేటాను లాగేసి వారిని సమస్యల్లో చిక్కుకునేలా చేస్తున్నారు. ఒకవైపు రెగ్యులర్ కాల్స్ మాత్రమే కాకుండా వర్చువల్ నెంబర్స్‌తో కాల్ చేసి ఆన్సర్ చేసేలోగా కట్ చేస్తారు. తిరిగి కాల్ చేసిన వారి నెంబర్స్ లిఫ్ట్ చేయడంతోనే వారి ఫోన్‌నెంబర్‌తో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్ హ్యాక్ అవుతుంది. సదరు వ్యక్తికి సంబంధించిన పూర్తి సమాచారం నేరగాళ్ల చేతికి చేరుతుంది. దీంతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. 91 మినహా 255, 371 , 375, 281సహా ఇతర దేశాలకు చెందిన కోడ్స్‌తో ఐఎస్‌డి కాల్స్ చేస్తున్నారు. ఇందుకోసం వివిధ దేశాల కోడ్స్‌తో ఆన్‌లైన్‌లో వర్చువల్ నెంబర్స్ కొనుగోలు చేస్తున్నారు. వీటితోపాటు వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ (వీఓఐపీ)నెంబర్స్ వినియోగిస్తున్నారు. కొన్ని కాల్స్‌కి ఆన్సర్ చేసినప్పటికీ నేరగాళ్లు #90 లేదా #09 ను డయల్ చేయాలని చెప్తారు. ఇలా చేస్తే సిమ్ వివరాలు క్లోన్ చేయడానికి నేరగాళ్లకు అవకాశం ఇచ్చినట్లే. దీనితో సిమ్‌వివరాలు నేరగాళ్ల చేతికి చేరతాయి. అ తరవాత డయల్ చేసిన వారి అకౌంట్ హ్యాక్ చేస్తారు. బ్యాంక్ అకౌంట్స్‌తో లింక్ అయిన ఫోన్‌నెంబర్ ట్రాప్ చేసి ప్రొఫైల్ అంతా తమ కంట్రోల్‌లోకి తెచ్చుకుంటారు. మిస్డ్ కాల్స్ ద్వారా ప్రీమియమ్ రేట్ సర్వీస్ స్కామ్ కూడా జరుగుతున్నట్లు సైబర్ పోలీసులు గ్రహించారు. దీనిని ఉపయోగించి స్కామర్లు సాధారణ ప్రజలను బురిడీ కొట్టించి అంతర్జాతీయ కాల్స్ చేయడం ద్వారా డబ్బులు నష్టపోతారు.

### అమ్మాయిల డీపీ చూసి మోసపోకండి

వర్చువల్ కాల్స్, మిస్‌డ్‌కాల్స్‌తో ట్రాప్ చేసే క్రమంలో సైబర్ నేరగాళ్లు అంతర్జాతీయ నెంబర్ల ద్వారా మిస్డ్ కాల్స్ ఇస్తారు. ఈ కాల్‌ను పొందినవారు తిరిగి కాల్ చేసినప్పుడు స్కామర్‌లు వెంటనే కాల్ చేసిన వారి బ్యాంక్ అకౌంట్స్, క్రెడిట్‌కార్డ్స్, కాంటాక్ట్‌లిస్ట్ నేషనల్ బ్యాంక్స్ పేరుతో ట్రూ కాలర్, అందమైన అమ్మాయిల డీపీలు పెట్టుకుంటున్నారు. ప్రధానంగా మహిళల ఫోన్స్ హ్యాక్ చేసినప్పుడు ఖచ్చితంగా వారి కాంటాక్ట్ లిస్ట్ దొరికితే సమస్యలు వస్తాయి. అందులో ఉన్నవారిని కూడా ట్రాప్ చేసే అవకాశాలు ఎక్కువ కాబట్టి అంతర్జాతీయ కోడ్‌తో వచ్చే ఏ కాల్‌ను ఎత్తవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్పారు. ఇటువంటి మోసాలకు ఎక్కువగా ఐటీ ఉద్యోగినులే నష్టపోతున్నారని, చదువుకున్నవారే దెబ్బతింటున్నారని పేర్కొన్నారు.

# గ్రేటర్‌లో 82.45 లక్షల వాహనాలు

### వాహనాల జాబితాలో 15 లక్షల కార్లు

### ముదురుతున్న ట్రాఫిక్ సమస్య..!

### సిగ్నల్ పాయింట్ వద్ద వాహనాల రద్దీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నది. దాదాపుగా జనాభాతో పోటీపడే విధంగా సంఖ్య పైపైకి దూసుకుపోతున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలను కలుపుకుంటే ఈ ఏడాది జనవరి ఆఖరు నాటికి 82,45,304 వాహనాలు ఉన్నట్టు రవాణా శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలు 58,71539 వాహనాలు ఉండగా కార్లు ఆ తర్వాతి స్థానంలో 15 లక్షల వరకు ఉన్నాయి.

### హైదరాబాద్ జిల్లా టాప్..

గ్రేటర్ పరంగా చూస్తే వాహనాల రిజిస్ట్రేషన్లలో హైదరాబాద్ జిల్లా ముందు వరుసలో ఉంది. హైదరాబాద్ పరిధిలో ఖైరతాబాద్, మెహిదీపట్నం, బండ్లగూడ, మూసారంబాగ్, తిరుమలగిరిలో, గ్రేటర్ పరిధిలోకి వచ్చే రంగారెడ్డిలో కొండాపూర్, అత్తాపూర్, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలో ఉప్పల్, కూకట్‌పల్లిలో ఆర్టీఏ కార్యాలయాలు ఉన్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో 40.66 లక్షల అన్ని రకాల వాహనాలు, రంగారెడ్డి పరిధిలో 20.39 లక్షలు, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలో 21.40 లక్షల వరకు ఉన్నట్లుగా రవాణా శాఖ రికార్డులు చెబుతున్నాయి. దీంతో ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు 82,45,304 వాహనాలు ఉన్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలు 58,71539 వాహనాలు ఉండగా కార్లు ఆ తర్వాతి స్థానంలో ఉన్నాయి. సాధారణంగా హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థలైన ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఎంఎంటీఎస్... గత కొన్ని సంవత్సరాలుగా మెట్రో రైలు ఉన్నప్పటికీ వ్యక్తిగత వాహనాలకు మాత్రం డిమాండు తగ్గడం లేదు. సాధారణ రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో దాదాపు 24 లక్షల మంది ప్రయాణిస్తుండగా... మూడున్నర లక్షల మంది ఎంఎంటీఎస్‌లో తమ గమ్యస్థానాలు చేరుకుంటున్నారు. మెట్రో రైలులో రోజుకు 1.20 లక్షల మంది వరకు ప్రయాణిస్తున్నారు. అయితే ఇంత స్థాయిలో ప్రజా రవాణాకు ఆదరణ లభిస్తున్నప్పటికీ వ్యక్తిగత వాహనాలపై ప్రయాణిస్తున్న వారి సంఖ్య కూడా లక్షల్లో ఉండటం విశేషం.


**గ్రేటర్‌లో వాహనాల సంఖ్య ఇలా..**
(ప్రస్తుతం జనవరి 31-2025 వరకు)

| | |
|---|---|
| హైదరాబాద్ జిల్లా - | 40,66100 |
| రంగారెడ్డి జిల్లా - | 20,39,177 |
| మేడ్చల్ జిల్లా - | 21,40027 |
| మొత్తం గ్రేటర్ పరిధిలో వాహనాల సంఖ్య - | 82,45,304 |

### జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య..!

నానాటికీ పెరుగుతున్న జనాభాతో వారి అవసరాలకు తగినట్టుగా నగరంలో వాహనాలు పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మెట్రోపాలిటన్ జీవనశైలికి అనుగుణంగా సేవలందించే సర్వీస్ యాప్‌లు రావడంతో అందులో పనిచేసే ఉద్యోగులు కూడా వ్యక్తిగత వాహనాలు వాడుతున్నారు. దాదాపు 85 లక్షల వాహనాలు నిత్యం రోడ్డుపైకి రావడంతో నగరంలో ఉదయం నుంచి సాయత్రం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు అంతకంతకూపెరిగిపోతున్నాయి. సిగ్నల్ పాయింట్స్ వద్ద 20సెకన్స్, 60 సెకన్స్ ఇలా సిగ్నలింగ్ ఉన్నప్పటికీ ఆ సమయంలో కొన్ని వాహనాలు మాత్రమే సిగ్నల్ దాటుతున్నాయి. అప్పటికే సిగ్నల్ వద్దకు వందలాది వాహనాలు వచ్చి చేరుతున్నాయి. ఈ క్రమంలో ప్రతీ సిగ్నల్ పాయింట్ వాహనాలతో రద్దీని తలపిస్తున్నది. కొన్ని సిగ్నల్ పాయింట్స్ వద్ద కాలు కింద పెట్టే పరిస్థితి కూడా ఉండటం లేదంటే అతిశయోక్తి కాదు.





తులం బంగారం ఎప్పుడు ఇస్తారంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను ప్రశ్నిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

# తులం బంగారం ఎప్పుడిస్తారు?

బంజారాహిల్స్ ఫిబ్రవరి 8: కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారంటూ.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ బహిరంగంగా నిలదీశారు. ఇందుకు దానం బదులిస్తూ ఆ హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదంటూ అంగీకరించారు. శనివారం షేక్‌పేట మండలం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ డివిజల్లో లబ్ధిదారులకు ఫిలింనగర్ లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జూబ్లీ హిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ కలగజేసుకొని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు చెక్కులతోపాటు తులం బంగారం ఎప్పుడు ఇస్తారంటూ నిలదీశారు. దీంతో అక్కడున్న వారందరూ తులం బంగారం హామీపై దానంను ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అంగీకరించారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఈ హామీ విషయాన్ని గుర్తు చేస్తానని సమాధానం ఇచ్చారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ డివిజన్ అంబేద్కర్ నగర్లో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు బస్తీల్లో 50 గజాల స్థలంలో ఇల్లు కట్టుకున్న వారి జోలికి వెళ్ళొద్దని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, వివిధ డివిజన్ల నేతలు మావిడి నర్సింగ రావు, రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.